

వరప్రదాయిని ఫాతిమామాత

ఏసుక్రీస్తు తల్లిగా ఫాతిమామాత భక్తుల వర ప్రదాయినిగా గ్రేటర్ వరంగల్‌లో కాజీపేట ఫాతిమానగర్‌లోని కేథడ్రల్ చర్చిలో విరాజిల్లుతోంది. - 8లో▸



అప్పుతెచ్చిన డబ్బు అగ్గిపాలు

ఇంటి నిర్మాణానికి, కూతురుకు ఇచ్చే కట్నం కోసం అప్పుగా తెచ్చిన డబ్బు అగ్నికి ఆహుతైంది. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో గుడిసె కాలిపోవడంతో ఈ ఘటన జరిగింది. - 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం $36.3^0/22.5^0$

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఉంటుంది. రాత్రివేళ కాస్త చలిగా ఉంటుంది.

న్యూస్‌రీల్

హ్యాండ్‌బాల్ పోటీల్లో బంగారు పతకం



రఘునాథపల్లి: మండలంలోని కోమల్ల గ్రామానికి చెందిన తాటికొండ వేణుయాదవ్ జిల్లా స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలో బంగారు పతకం సాధించాడు. వరంగల్ జిల్లాలోని పైడిపల్లిలో జై జవాన్ జై కిసాన్ ఆధ్వర్యంలో ఈ నెల 8 నుంచి 10 వరకు 45వ తెలంగాణ హ్యాండ్ బాల్ స్టేట్ లెవెల్ జూనియర్ బాయ్స్ ఇంటర్ డిస్ట్రిక్ పోటీల్లో వరంగల్ టీం తరఫున అద్భుత ప్రతిభ కనబర్చి గోల్డ్ మెడల్ సాధించాడు. ఈ సందర్భంగా జట్టులో గోల్డ్ మెడల్ సాధించిన వేణుయాదవ్‌ను గ్రామస్తులు అభినందించారు.

చేనేత సహకార సంఘాలకు ప్రోత్సాహకం

జనగామ రూరల్: జిల్లాలోని చేనేత కార్మికులకు సహకార సంఘాలకు తగిన ప్రోత్సాహకం అందించడమే లక్ష్యంగా పని చేస్తామని జిల్లా జౌళి శాఖ అధికారి చౌడేశ్వరీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి ఏటా టెస్కో ద్వారా వచ్చిన చేనేత ఆర్డర్స్‌లను చేనేత కార్మికులకు ఆయా సంఘాలకు అందజేయడం జరుగుతుందన్నారు. చేనేత కార్మికుల గుర్తింపు లభించేవిధంగా తగిన విధంగా మార్కెట్ కల్పిస్తామన్నారు. కార్మికుల కుటుంబాలకు సామాజిక భద్రత కల్పించేలా ప్రవేశపెట్టిన నేతన్న బీమా పథకంతో 18 నుంచి 59 ఏళ్ల వరకు చేనేత కార్మికులకు బీమాను నిరంతరాయంగా కల్పిస్తామన్నారు. జిల్లాలోని జియో ట్యాగింగ్ కలిగిన చేనేత, మరమగ్గాల కార్మికులు విధిగా వారి వివరాలను టీ నేతన్న యాప్‌లో నమోదు చేసుకోవాలన్నారు.

పథకాలు సద్వినియోగం చేసుకోవాలి



జనగామ రూరల్: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకొని ఆర్థిక ప్రగతి సాధించాలని జిల్లా సహకార సంఘాల ఆడిట్ అధికారి దివ్య అన్నారు. ఆదివారం పట్టణంలోని గిర్నిగడ్డ ప్రాంతంలోని పెద్దమ్మ తల్లి దేవాలయ ప్రాంగణంలో ఏరియా మహిళా మత్స్యకార్మిక సంఘం ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సహకార సంఘాల ద్వారా నిర్వహించే వ్యాపార సముదాయాలు, ఎప్పటికప్పుడు ఆడిట్ చేయించుకోవాలన్నారు. దీంతో లాభనష్టాలు బేరీజు వేసుకొని ఆర్థిక అభివృద్ధి చెందవచ్చునని తెలిపారు. ఆడిటింగ్ సక్రమంగా ఉన్నప్పుడే ఫలితాలు ప్రతిఒక్కరికి అందుతాన్నారు. సొసైటీ అధ్యక్షురాలుగా బోయిని అంజలీ, ప్రధాన కార్యదర్శిగా మచ్చ లక్ష్మి, ఉపాధ్యక్షురాలుగా రంపె లక్ష్మి, డైరెక్టర్లుగా పుప్పాల నిర్మల, సత్యలక్ష్మి, బాలమణి, మంగమ్మ తదితరులు ఎన్నికైయ్యారు.

ఉద్యమకారుల హక్కుల సాధనకు ఉద్యమిస్తాం



రఘునాథపల్లి: 1969 ఉద్యమకారుల హక్కుల సాధనకు ఉద్యమిస్తామని టీఎండీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు, హైకోర్టు న్యాయవాది ననుమాన స్వామి అన్నారు. ఆదివారం మండలంలోని నిడిగొండలో ఉద్యమకారులు, వారి కుటుంబాల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యమకారులకు తగిన గుర్తింపునిచ్చి ప్రయోజనాలు కల్పిస్తుందని ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో హక్కుల సాధనకు ఏం చేయాలనే దానిపై చర్చించారు. జిల్లాలో 46 మంది 1969 ఉద్యమకారుంటారని అంచనా. వీరిలో చాలా మంది మరణించడంతో వారి భార్యలు న్యాయ పోరాటం చేయాలని భావిస్తున్నారు. ప్రాణాలకు తెగించి నాడు పోరాడిన వారికి సర్కార్ తప్పక గుర్తింపు నివ్వాలని, ప్రస్తుత ప్రభుత్వం ఉద్యమకారుల విషయంలో సానుకూలంగా ఉందన్నారు. అందరికి న్యాయం జరుగుతుందని భావిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో పూర్వ ఉద్యమకారులు ఎలపాటి రాంరెడ్డి, కేమిడి వీరారెడ్డి, రాజేశ్వర్‌రావు, సోమయ్య, ఉద్యమకారుల కుటుంబాలు పాల్గొన్నారు.

వరంగల్ మీదుగా మరో 'వందేభారత్'

కాశిబుగ్గ : వరంగల్ మీదుగా సికింద్రాబాద్, విశాఖపట్నం మధ్య మరో వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు మంగళవారం(రేపు) నుంచి నడవనుంది. దీనిని దేశ ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్‌గా సికింద్రాబాద్ నుంచి ప్రారంభించనున్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం మరో రైలును అందుబాటులోకి తీసుకువచ్చినట్లు రైల్వే అధికారులు ప్రకటనలో తెలిపారు.

మరో రెండు గ్యారంటీలకు శ్రీకారం



- ఇందిరమ్మ ఇళ్లు, మహాలక్ష్మి పథకానికి సన్నద్ధం
- గృహజ్యోతికి 1.47లక్షలు, మహాలక్ష్మికి 1.53 లక్షల దరఖాస్తులు
- నేడు జీఓ వచ్చే అవకాశం!



దేవరుప్పుల మండలం ధర్మాపురంలో పంపిణీకి సిద్ధంగా ఉన్న డబుల్ బెడ్ రూం ఇళ్లు

జనగామ: ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన మాటకు కట్టుబడి నాలుగు గ్యారంటీ స్కీంలను అమలు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం... మరో రెండింటికి శ్రీకారం చుట్టబోతున్నారు. ఇందుకు సంబంధించి లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియకు సంబంధించి కలెక్టర్లకు సర్క్యులర్ జారీ చేసినట్లు సమాచారం. ప్రజాపాలనలో వచ్చిన అప్లికేషన్లను ప్రామాణికంగా తీసుకుని పథకాలకు అర్హత ఉన్న వారిని ఎంపిక చేయనున్నారు. నేడు సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా భద్రాద్రి కొత్తగూడెంలో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రారంభించనుండగా.. ఈ నెల 12వ తేదీన జరిగే కేబినెట్ సమావేశంలో మహాలక్ష్మి స్కీంకు సంబంధించి ఆమోద ముద్ర తెలుపనున్నారు. నాలుగు పథకాలను అమలు చేస్తున్న ప్రభుత్వం... పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ వెలువడక ముందే.. ఆరు గ్యారంటీల హామీని నిలబెట్టుకునేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. తెలంగాణలో నూతనంగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీ స్కీంల హామీలో... ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం, ఆరోగ్య శ్రీ ద్వారా రూ.10 లక్షల వరకు ఉచిత వైద్య సేవలు, రూ.5 వందలకే గ్యాస్ సిలిండర్, 2 వందల యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పథకాలను ఇప్పటికే అమలు చేస్తున్నారు. మిగిలి ఉన్న రెండు పథకాలు ఇందిమ్మ ఇళ్లు, మహిళలకు నెలకు రూ.25 వందలు (మహాలక్ష్మి) స్కీంలు మిగిలి ఉన్నాయి. రెండింటిని అమలు చేసి.. వందశాతం గ్యారంటీతో పార్లమెంట్ ఎన్నికలకు వెళ్లేందుకు కాంగ్రెస్ శ్రేణులు సిద్ధమవుతున్నారు. ఇందుకు సంబంధించి జిల్లాల వారీగా పథకాలను పక్కాగా అమలు చేసేందుకు సర్కారు ప్రత్యేక దృష్టి సారించింది. ప్రజా పాలనలో వచ్చిన దరఖాస్తుల ఆధారంగా... లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ ఉంటుంది. జిల్లాలో ఇందిరమ్మ ఇళ్లకు (గృహజ్యోతి) 1,47,939, మహిళలకు నెలకు రూ.25 వందల స్కీం (మహాలక్ష్మి) కోసం 1,53,348 ప్రజా పాలన దరఖాస్తులు వచ్చాయి. ఇందిరమ్మ ఇళ్ల పథకానికి ప్రభుత్వం నేడు శ్రీకారం చుట్టబోతుండగా.. జిల్లాల వారీగా అమలుకు అదే రోజు జీఓ జారీ చేయనున్నట్లు సమాచారం. ప్రజా పాలనలో ఇందిరమ్మ ఇళ్ల కోసం వచ్చిన దరఖాస్తుల ఎంపిక ప్రక్రియ ఎలా చేస్తారు... అర్హులు ఎవరనే దానిపై పూర్తి స్థాయి గైడ్ లైన్స్ రావాల్సి ఉంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో జిల్లాలో 1,477 డబుల్ బెడ్ రూం ఇంటి నిర్మాణాలు పూర్తి చేయగా, 1,252 మంది అర్హులుగా జాబితాను సిద్ధం చేసి, 225 మంది పేర్లను హోల్డ్‌లో ఉంచారు. కాగా 670 మంది గృహ ప్రవేశం చేయగా...582 మంది నివేదికను పక్కన బెట్టారు. ఆయా మండలాల పరిధిలో 1,205 డబుల్ బెడ్ రూం ఇళ్లు నిర్మాణ దశలోనే నిలిచి పోయాయి. కాంగ్రెస్ ప్రభుత్వం మొదటగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికపైనే దృష్టి సారించగా... డబుల్ బెడ్ రూం ఇళ్ల పంపిణీకి సంబంధించి ఎటువంటి క్లారిటీ ఇవ్వలేదు. దీంతో సొంతింటి కల సాకారం కోసం వందలాది మంది నిరుపేదలు వేయి కళ్లతో ఎదురు చూస్తున్నారు.

మహాలక్ష్మి పథకానికి కార్యాచరణ

మహిళలకు నెలకు రూ.25 వందల చొప్పున అందించే భృతిపై ప్రభుత్వం కార్యాచరణ చేస్తోంది. జిల్లాలో ప్రజాపాలన కార్యక్రమంలో మహాలక్ష్మి కోసం 1,53,348 దరఖాస్తులు వచ్చాయి. పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ విడుదల కానుండడంతో.. రెండు రోజుల్లో జరిగే మంత్రివర్గ సమావేశంలో మహాలక్ష్మి పథకానికి ఆమోద ముద్ర వేస్తారని తెలుస్తుంది. ఆరు గ్యారంటీల్లో నాలుగు స్కీంల అమలుతో మాట నిలబెట్టుకున్న సీఎం రేవంత్ రెడ్డి.. ఆ రెండు పథకాలను సైతం అమలు చేసి.. అత్యధిక స్థానాల్లో ఎంపీ సీట్లు కైవసం చేసుకోవాలనే దానిపై ముమ్మర కసరత్తు చేస్తున్నారు.

20 ఏళ్లుగా అద్దెకుంటున్నాం..



20 ఏళ్లుగా అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నాం. భర్త నాయీబ్రాహ్మణ వృత్తి చేసి కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఇంట్లో మాతో పాటు ఇద్దరు పిల్లలతో నలుగురు కుటుంబ సభ్యులం ఒక్కరి కష్టంతో బతుకుతున్నం. నెలకు రూ.45 వందలు ఇంటి అద్దె చెల్లిస్తున్నాం. సంపాదనలో సగానికి పైగా ఇంటి అద్దెకే ఖర్చవుతుంది. కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు ఇందిరమ్మ ఇల్లు అందించేందుకు ముందుకు రావడం చాలా సంతోషంగా ఉంది.

- కొలిపాక సునీత, గృహిణి, స్టేషన్‌ఘన్‌పూర్

విద్యతోనే ఉజ్వల భవిష్యత్

- ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి
- ఘనంగా ఏకశిల హైస్కూల్‌లో వార్షికోత్సవం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే పల్లా

జనగామ: విద్యతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి సూచించారు. ఆదివారం రాత్రి జిల్లా కేంద్రంలోని ఏకశిల బీఈడీ క్యాంపస్‌లో ఏకశిల పబ్లిక్ స్కూల్ 41వ వార్షికోత్సవాన్ని డైరెక్టర్ చిర్ర ఉపేందర్‌రెడ్డి అధ్యక్షత వహించగా ఎమ్మెల్యే జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నాలుగు దశాబ్దాలుగా మారుతున్న కాలానుగుణంగా ఈ ప్రాంత విద్యార్థుల విద్యాభివృద్ధికి పాటుపడుతున్న యాజమాన్యం తీరును ప్రశంసించారు. పాఠశాలను అద్భుతంగా నడిపిస్తూ ఒక మైలురాయిని దాటిస్తున్న యాజమాన్యం విద్యాబోధన జఠిలంగా మారిన క్రమంలోనూ సాంకేతిక పరమైన పరిజ్ఞానం అందిస్తున్నట్లు విధితమవుతుందన్నారు. జీవితంలో మంచి ఉద్యోగం సంపాదించుకోవాలంటే ఇంగ్లిష్ కమ్యూనికేషన్‌పై తప్పకుండా పట్టు సాధించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. విద్యార్థులు కష్టపడి కాదు.. ఇష్టపడి చదవాలన్నారు. పదో తరగతి పరీక్షలు బాగా రాయాలని ఆకాంక్షించారు. విద్యార్థుల సాంస్కృతిక కళారూపాలు ఆలోచింపజేశాయని కొనియాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లాను స్కూల్ యాజమాన్యం శాలువాతో సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చిర్ర ఇందిర, మున్సిపల్ చైర్ పర్సన్ పోకల జమునలింగయ్య, కౌన్సిలర్లు అనిత, స్వరూప, జూకంటి లక్ష్మి, శ్రీలత, కమలమ్మ, డాక్టర్ రాజమౌళి, కన్నా పర్శరాములు, బాల్దె సిద్దిలింగం, ట్రస్మా స్టేట్ అడ్వైజర్ ప్రభాకర్ రెడ్డి, ఎస్‌పీఆర్ స్కూల్ వీరేందర్, తదితరులు ఉన్నారు.

మానవత్వం చాటుకున్న మంత్రి సురేఖ



క్షతగాత్రుడి వద్ద మంత్రి కొండా సురేఖ

రఘునాథపల్లి: డివైడర్‌ను ద్విచక్రవాహనం ఢీకొన్న ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన వ్యక్తిని గుర్తించిన.. మంత్రి కొండా సురేఖ వాహనాన్ని నిలిపి క్షతగాత్రుడిని జనగామ ఏరియా ఆస్పత్రికి పంపించి మానవత్వం చాటుకున్న సంఘటన మండల కేంద్రంలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. హనుమకొండ– హైదరాబాద్ జాతీయ రహదారిలోని రఘునాథపల్లి సబ్‌స్టేషన్ ఎదురుగా ద్విచక్రవాహనంపై వెళ్తున్న ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు డివైడర్‌ను ఢీకొట్టి కింద పడి తీవ్ర గాయాలపాలయ్యాడు. అదే సమయంలో కాన్వాయ్‌తో వస్తున్న మంత్రి కొండా సురేఖ ఆ వ్యక్తిని గుర్తించి తన వాహనాన్ని పక్కకు నిలిపారు. వెంటనే అంబులెన్స్‌లో క్షతగాత్రుడిని జనగామ ఏరియా ఆస్పత్రికి పంపించారు. క్షతగాత్రుడిని ఆస్పత్రిలో చేర్పి కుటుంబ సభ్యులు వచ్చే వరకు దగ్గరుండాలని మంత్రి పోలీసులను ఆదేశించారు. ప్రాణాప్రాయ స్థితిలో ఉన్న వ్యక్తికి సత్వరం వైద్య సేవలు అందేలా చొరవ తీసుకున్న మంత్రిని స్థానికులు అభినందించారు.

కార్మికుల వేతన జీఓ సవరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్వీ రమ

జనగామ రూరల్: 73వ షెడ్యూల్ పరిశ్రమల్లో పని చేస్తున్న కార్మికుల వేతన జీఓ సవరించాలి సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎస్వీ రమ డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా అధ్యక్షుడు బోట్ల శ్రీనివాస్ అధ్యక్షతన జిల్లా కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్వీ రమ మాట్లాడుతూ పరిశ్రమల్లో పని చేస్తున్న కార్మికులు చాలీచాలని వేతనాలతో కుటుంబాలు గడవక ఇబ్బందులు పడుతున్నారని జీఓ సవరించి నెలకు రూ.26 వేలు అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం రాష్ట్ర కోశాధికారి వంగూరి రాములు మాట్లాడుతూ కార్పొరేట్ శక్తులు పెట్టుబడిదారులకు దేశ సంపదను దోచిపెడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రాపర్తి రాజు, కోశాధికారి విజేందర్, పోదల నాగరాజు, బాలరాజు, ఆనందం తదితరులు పాల్గొన్నారు.

శ్రీరుద్రేశ్వరుడికి మహాన్నపూజ



మహాన్నపూజలో రుద్రేశ్వరస్వామి

హన్మకొండ కల్చరల్ : మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం హనుమకొండలోని వేయిస్తంభాల ఆలయంలో శ్రీరుద్రేశ్వరస్వామి వారికి మహా అన్నపూజ నిర్వహించారు. ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో ఉదయం 5 గంటల నుంచి నిత్యపూజలు, రుద్రాభిషేకం, సామూహిక రుద్రాభిషేకాలు నిర్వహించారు. దాతలు విజయ్‌మిశ్రా, సునీతామిశ్రా సౌజన్యంతో మిర్యాలపొడి మిళితంచేసిన 51 కిలోల పెరుగన్నంతో మహాశివలింగాన్ని అలంకరించి పూజలు చేశారు. కార్యక్రమంలో రుద్రేశ్వర స్వామి సేవా సమితి సభ్యులు గరిగె అశోక్, కట్ల రాజు, చందు, రవి, శ్రీను తదితరులు సేవలందించారు. ఆలయ ఈఓ వెంకటయ్య పర్యవేక్షించారు. ఇదిలా ఉండగా.. సోమవారం ఉదయం శ్రీఆంజనేయస్వామి వారికి చందనోత్సవం, ఆకుపూజ, శ్రీరుద్రేశ్వరస్వామి వారికి ప్రత్యేక పూజలు, మహాపూర్ణాహుతితో ఉత్సవాలు పరిసమాప్తి అవుతాయని గంగు ఉపేంద్రశర్మ తెలిపారు.

వైభవంగా వసంతోత్సవం



రంగులు చల్లుతున్న అర్చకులు

పాలకుర్తి టౌన్: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీసోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి దేవస్థానంలో ఆదివారం రాత్రి 8.30 గంటలకు శ్రీసోమేశ్వరలక్ష్మీనర్సింహస్వామికి వసంతోత్సవం వైభవంగా జరిగింది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు శివపార్వతులు, లక్ష్మీనర్సింహస్వామి వసంతోత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ఆలయ పూజారులు, పండితుల మంత్రోచ్చారణల నడుమ మహాశివుడికి అత్యంత ప్రీతిపాత్రమైన హోలీ పర్వదినాన్ని మరిపించేలా స్వామి వార్ల వసంతోత్సవ (రంగులు చల్లుకునే) వేడుకలను నిర్వహించారు. ఈ ఉత్సవాన్ని వందలాది మంది భక్తులు తిలకించి తన్మయత్వం పొందారు. అనంతరం శివపార్వతులు, లక్ష్మీనర్సింహస్వామిలను ఊయలలో ఆశీనులను చేసి డోలారోహణం నిర్వహించారు. ఆలయ ఆవరణంలో ఊరేగించారు. సదస్యం, పుష్పయాగం, పల్లకి సేవా వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ కృష్ణమాచార్యులు, ఈఓ భాగం లక్ష్మీప్రసన్న, అర్చకులు అర్చకులు దేవగిరి లక్ష్మన్న, డీవీఆర్‌శర్మ, అనిల్ కుమార్, నాగరాజు, ధర్మకర్తలు ఉత్సవ కమిటీ సభ్యులు భోనగిరి సాగర్, పన్నీరు వెంకన్న, ఐతరాజు, మాదాస్ హరీస్‌గౌడ్, ఇనుమల నాగరాజు, మాజీ చైర్మన్ చిలువేరు కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



దేవతామూర్తులకు డోలారోహణం, పుష్పయాగం నిర్వహిస్తున్న అర్చకులు

ప్రజా నాయకుడు సీఎం రేవంత్‌రెడ్డి



మిఠాయి తినిపిస్తున్న కొమ్మూరి

జనగామ రూరల్: ఉద్యమ సమయంలో ఆర్టీసీ కార్మికుల శ్రమను దోచిన గత ప్రభుత్వం కార్మికులను పట్టించుకోలేదని కార్మిక శ్రేయస్సు కోరే ప్రజానాయకుడు సీఎం రేవంత్‌రెడ్డి పీఆర్‌సీ ప్రకటించారని డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. ఆర్టీసీ కార్మికులకు 21 శాతం పీఆర్సీ ముఖ్యమంత్రి ప్రకటించిన నేపథ్యంలో ఆదివారం కార్మికులు, డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కార్మికులకు శుభాకాంక్షలు తెలిపి స్వీట్‌లు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ హయాంలో పీఆర్సీ ఇస్తే పదేళ్ల పాలించిన బీఆర్ఎస్ కార్మికులను పట్టించుకోలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు చెంచారపు శ్రీనివాస్ రెడ్డి, కొమురవెల్లి దేవస్థాన చైర్మన్ లక్ష్మారెడ్డి, గిరి కొండల్ రెడ్డి, మహిళా అధ్యక్షురాలు బడికె ఇందిర, మల్లారెడ్డి, జక్కుల అనిత, యూత్ అధ్యక్షుడు బనుక శివరాజ్ పాల్గొన్నారు.

వెంకట్‌రెడ్డి ఆశయాలను కొనసాగిస్తాం



నివాళులర్పిస్తున్న రాజారెడ్డి, నాయకులు

జఫర్‌గఢ్: కామ్రేడ్ వెంకట్‌రెడ్డి ఆశయాలను కొనసాగిస్తామని సీపీఐ జిల్లా కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సీహెచ్ రాజారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని రఘునాథపల్లి గ్రామానికి చెందిన సీపీఐ సీనియర్ నాయకులు బొమ్మినేని వెంకట్‌రెడ్డి అనారోగ్యంతో మృతి చెందడంతో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి సీహెచ్ రాజారెడ్డి పార్టీ బృందంతో కలిసి ఆదివారం మృతదేహాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వెంకట్‌రెడ్డి మృతదేహంపై ఎర్రజెండా కప్పి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల నుంచి సీపీఐలో పని చేయడంతో పాటు ప్రజా సమస్యలపై అలుపెరగని పోరాటాలు సాగించారన్నారు. ఆయన సేవలు ఎన్నటికి మరువలేనివన్నారు. ఆయన ఆశయ సాధనకు పని చేస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు ఆది సాయన్న, అకుల శ్రీనివాస్, జువారి రమేష్, లింగారెడ్డి, రాజమౌళి, బిమానాథం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

హక్కుల పరిరక్షణలో ప్రభుత్వాల విఫలం

- పీఓడబ్ల్యూ రాష్ట్ర కన్వీనర్ పంగ వరలక్ష్మి



సమావేశంలో మాట్లాడుతున్న వరలక్ష్మి

జనగామ రూరల్: సమాజంలో మహిళలపై వేధింపులు పెరుగుతున్నాయని, మహిళ హక్కుల పరిరక్షణలో ప్రభుత్వాలు విఫలం చెందాయని పీఓడబ్ల్యూ రాష్ట్ర కన్వీనర్ పంగ వరలక్ష్మి అన్నారు. ఆదివారం రాష్ట్ర స్థాయి సమావేశం జిల్లా కేంద్రంలోని సాహితీ డిగ్రీ కళాశాలలో జరిగింది. ఈ సందర్భంగా పట్టణంలోని బస్టాండ్ నుంచి సాహితీ కళాశాల వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రారంభం సమావేశంలో ముందుగా విప్లవ ఉద్యమంలో అసువులు బాసిన మహిళా అమరులకు రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా వరలక్ష్మి మాట్లాడుతూ దేశంలో అనేక రంగాల్లో మహిళలు రాణిస్తున్న ఇంకా అనేక గ్రామాల్లో వంటింటిలో మగ్గుతున్నారని, మహిళా సమానత్వంపై ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రేమ పేరుతో మహిళలపై అత్యాచారాలు, హత్యలు, వరకట్న వేధింపులు, గృహహింసలు పెరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సరిత, విజయ, జయమ్మ, రేణుక, అంజమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల దీవెనలతో ఇందిరమ్మ రాజ్యం

- అందరి ఆశలు, ఆకాంక్షలు నెరవేరుతాయి
- ధనిక రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిన కేసీఆర్
- జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి
- వరంగల్ నగరంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన కార్యక్రమంలో మంత్రి పొంగులేటి, పక్కన మంత్రులు సురేఖ, సీతక్క

వరంగల్ అర్బన్ : ప్రజల దీవెనలతో ఇందిరమ్మ రాజ్యం తెచ్చుకున్నాం.. ధనిక రాష్ట్రాన్ని పదేళ్లలో రూ.7లక్షల కోట్ల అప్పుల కుప్పగా మార్చిన కేసీఆర్‌కు తగిన గుణపాఠం చెప్పారు.. అందరి ఆశలు, ఆకాంక్షలు, కోరికలు నెరవేరుతాయని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. వరంగల్ మహా నగర అభివృద్ధిలో భాగంగా ఆదివారం ఎస్ఎస్ఎం క్లబ్ ప్రాంగణంలో రూ.280.85కోట్ల అభివృద్ధి పనులకు మంత్రులు కొండా సురేఖ, ధనసరి అనసూయ, నగర మేయర్ సుధారాణి, ఎమ్మెల్యేలతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం మంత్రి పొంగులేటి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీ హామీల్లో ఇప్పటికే నాలుగు లబ్ధిదారుల చెంతకు చేరాయన్నారు. ప్రజల మనసులో ఉన్న ఇందిరమ్మ ఇళ్ల కార్యక్రమాన్ని సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం(నేడు) ఆవిష్కరిస్తారని, ఎన్నికల నియమావళి రాకముందే ప్రజలకు మరిన్ని సౌకర్యాలు కల్పించాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని పేర్కొన్నారు. ఇందిరమ్మ రాజ్యం వచ్చిన ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి.. కేవలం 72 రోజుల్లో 31 వేల కొలువులు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ సర్కారుకే దక్కుతుందన్నారు. 75 రోజుల్లోనే సుమారు 11,600 ఉపాధ్యాయ పోస్టులకు మెగా డీఎస్సీకి నోటిఫికేషన్ ఇచ్చామని చెప్పారు. తొమ్మిది రోజుల పాటు ప్రజాపాలన నిర్వహించి మీ ఇంటి వద్దకే వచ్చి మీకు ఏంకావాలో తెలుసుకున్నాం.. మీ కోరికలను ఒక్కొక్కటిగా తీరుస్తున్నామని వివరించారు. ఉద్యోగస్తులకు ఒకటి నుంచి మూడో తేదీలోగా జీతాలు ఇస్తున్న ప్రభుత్వం తమదని అన్నారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ ఇందిరమ్మ రాజ్యంలో ప్రజలకు జరుగుతున్న మేలును చూసి ఓర్వలేని ఎమ్మెల్సీ కవిత అవాకులు, చవాకులు పేలుతున్నారని ధ్వజమెత్తారు. మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తుందని చెప్పారు. ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, నాగరాజు, కార్పొరేటర్లు, అధికారులు, సిబ్బంది, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు, సీనియర్ సిటిజన్స్ శాఖ ఆధ్వర్యంలో రూ.19లక్షల చెక్కులు, దివ్యాంగులకు 12 ద్విచక్ర వాహనాలు, 5 బ్యాటరీ వీల్‌చైర్ వాహనాలు పంపిణీ చేశారు.

క్లుప్తంగా

వ్యక్తికి తీవ్రగాయాలు

వెంకటాపురం(కె): మండల పరిధిలోని కమ్మరిగూడెంలో తాటిచెట్టు మీద పడడంతో వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన ఆదివారం జరిగింది. గ్రామస్తుల కథనం ప్రకారం.. కమ్మరిగూడేనికి చెందిన సబక సర్వేశ్వర్‌రావు గ్రామ సమీపంలోని తన వ్యవసాయ భూమిలో ఉన్న తాటిచెట్లను జేసీబీ సాయంతో తొలగించి చేను శుభ్రం చేసుకుంటున్నాడని తెలిపారు. జేసీబీతో తాటిచెట్టును తొలగిస్తున్న క్రమంలో చెట్టుకు కొంతదూరంలో సర్వేశ్వరావు నిలబడి ఉన్నాడన్నారు. జేసీ బీ తాటిచెట్టును కింద పడేస్తుండగా చెట్టుకొమ్మలు సర్వేశ్వరావుపై పడ్డాయని తెలిపారు. దీంతో అతని తలకు తీవ్రగాయాలయ్యాయి. గ్రామస్తులు ఆటోలో చికిత్స నిమిత్తం వెంకటాపురం వైద్యశాలకు తరలించారు. మెరుగైన వైద్యంకోసం ములుగు ఏరియా ఆస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి..

ఖిలా వరంగల్: వరంగల్ ఫోర్ట్‌పై పెట్రోల్ బంక్ జంక్షన్‌లో ఆదివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో మధ్యకోటకు చెందిన మొగిలిచెర్ల శ్రీకాంత్(40) తలకు బలమైన గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని 108 వాహనంలో హుటాహుటిన ఎంజీఎంకు తరలించారు. అతడి పరిస్థితి విషంగానే ఉందని తెలిసింది. అలాగే ఆదివారం సాయంత్రం గిర్మాజీపేటకు చెందిన కాసర్ల రాంబాబు కుమార్తె నీరజ, కుమారుడు గణేష్ బైక్‌పై రంగశాయిపేట నుంచి వరంగల్‌కు బయల్దేరారు. ఈ క్రమంలో నాగమయ్య కమాన్‌దాటగానే వాహనం అదుపు తప్పి కింద పడిపోయారు. ఈ ఘటనలో నీరజ, గణేష్‌కు గాయాలయ్యాయి. ఆ సమయంలో అటుగా వెళ్తున్న మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ పి.మల్లయ్య స్పందించారు. క్షతగాత్రులను తన వాహనంలో ఎంజీఎంకు తరలించే ప్రయత్నం చేస్తుండగా సమయానికి చేరిన 108 వాహనంలో ఎంజీఎంకు తరలించారు.

కల్తీ పెట్రోల్‌పై వాహనదారుల ఆందోళన

నడికూడ: మండలంలోని కంఠాత్మకూర్ గ్రామ శివారులోని కనకదుర్గ పెట్రోల్‌బంకులో కల్తీ పెట్రోల్ విక్రయిస్తున్నారని వాహనదారులు ఆదివారం ఆందోళనకు దిగారు. కంఠాత్మకూర్‌కు చెందిన అభిరానందన్ తన బైక్‌లో పెట్రోల్ పోసుకొని కొద్ది దూరం వెళ్లగా, బైక్ మొరాయించడంతో అనుమానం వచ్చి మెకానిక్ వద్ద బైక్‌ను చూపించాడు. బాటిల్‌లో పెట్రోల్ తీసి చూడగా పెట్రోల్ కల్తీ అయినట్లు గుర్తించి వెంటనే పెట్రోల్‌బంకు సిబ్బందికి చూపించి నిలదీశారు. అనంతరం బంకు వద్ద ఆందోళన చేపట్టాడు. పెట్రోల్ బంకుపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.



సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

PLOT FOR SALE

GWMC & KUDA అప్రూవ్డ్ లే అవుట్ చింతగట్టు హన్మకొండలో అన్ని అభివృద్ధి పనులతో ప్లాట్లు అమ్మబడును, కేవలం 15000/-లక గజం మాత్రమే. వివరాలకు సంప్రదించండి. 9849992488. [W-1264853]

WANTED

ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పురుషులు కావలెను. వీక్లీ పేమెంట్స్ కలవు. మీ పేరు, అడ్రస్ కాల్ / వాట్సప్ చేయగలరు. 90596 63584, 95026 15217. [M-1233879]

ప్రముఖ కంపెనీలో వర్క్ ఫ్రమ్ హోం స్త్రీ/పు కావలెను. జీతం : 15-25 వేలు. మీ పేరు, అడ్రస్ కాల్ / వాట్సప్ చేయగలరు. సంప్ర. 95027 12418, 90306 12463. [M-1233881]

హరేకృష్ణ హోం కేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ: 18K ఫోన్: 9640258899 / 9640468899. [H-799851]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 260/- రూ॥ అదనపు లైను 60/- రూ॥ మాత్రమే 5% GST అదనము

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
హన్మకొండ : 9010144453
వరంగల్ : 9705748198
నర్సంపేట : 9553955722
జనగామ : 9951602871
మహబూబాబాద్ : 9010144453
పరకాల : 9010299096
జయశంకర్ భూపాలపల్లి : 9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రత్యుత్తరం ఇవ్వాలని మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

వరప్రదాయిని ఫాతిమామాత

నేడు ఉత్సవాలు ప్రారంభం
- 71వ ఉత్సవాలకు సర్వం సిద్ధం
- 11, 12, 13తేదీల్లో నిర్వహణ
- ఏర్పాట్లు పూర్తి
- వివిధ జిల్లాల నుంచి భక్తుల రాక



విద్యుత్ కాంతులతో ఫాతిమానగర్ కేథడ్రల్ చర్చి

కాజీపేట రూరల్ : ఏసుక్రీస్తు తల్లిగా ఫాతిమామాత భక్తుల వరప్రదాయినిగా గ్రేటర్ వరంగల్‌లో కాజీపేట ఫాతిమానగర్‌లోని కేథడ్రల్ చర్చిలో విరాజిల్లుతోంది. మేత్రాసన పీఠాధిపతి బిషప్ ఉడుములబాల ఆధ్వర్యంలో ఈ నెల 11, 12, 13వ తేదీల్లో 71వ ఫాతిమామాత వేడుకలు వైభవంగా జరుగనున్నాయని తెలిపారు. ఓరుగల్లు డయాసిస్ కమిటీ ఆధ్వర్యంలో సర్వం సిద్ధం చేసిందని బిషప్ సెక్రటరీ ఫాదర్ అనుకిరణ్ వెల్లడించారు. తెలంగాణలో సుమారు 12జిల్లాల(మేత్రాసనం పీఠాధిపతి పరిధి) నుంచి భక్తులు రానున్నారని, చర్చిని, ఫాతిమామాత గుహను విద్యుత్ కాంతులతో అలంకరించి, ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు.

నవదిన ప్రార్థనలతో ప్రారంభం


ఈ నెల 3న ఫాతిమా ఫీస్ట్ ఉత్సవాలను నవదిన ప్రార్థనలతో ఓరుగల్లు మేత్రాసం పీఠాధిపతి డాక్టర్ ఉడుములబాల ప్రారంభించారు. 12వ తేదీ సాయంత్రం ఫాతిమానగర్ పురవీధుల్లో ఫాతిమా మాత స్వరూపంతో ఊరేగింపు మహా రథ ప్రదక్షిణ, కొవ్వొత్తులతో దివ్యప్రసాద ప్రదక్షిణ-దివ్య ప్రసాద ఆశీర్వాదంతో ముగింపు ఉంటుంది. ఉత్సవాల్లో హైదరాబాద్ అగ్రపీఠాధిపతి కార్డినల్ పూల అంథోని ముఖ్య అతిథిగా పాల్గొంటారని కమిటీ బాధ్యులు వెల్లడించారు.

ఫాతిమా చర్చికి ఘన చరిత్ర

1949లో ఆనాటి హైదరాబాద్ వికార్ మోన్సిగ్నోర్ అల్ఫోన్స్ బెరెట్టా వరంగల్ మేత్రాసనం ఏర్పాటుకు అనేక ప్రయత్నాల అనంతరం ప్రస్తుత ఫాతిమానగర్ స్థలం 71ఎకరాలు కొనుగోలు చేశారు. ఆనాటి ప్రభుత్వం మేత్రాసనం భవన నిర్మాణానికి అనుమతి నిరాకరించారు. ఈ క్రమంలో బిషప్ బెరెట్టా సతమతమవుతున్న క్రమంలో పోర్చుగీసు దేశం నుంచి ఫాతిమామాత స్వరూపం హైదరాబాద్‌కు 1960 మే 14వ తేదీన తీసుకొచ్చారు. ఫాతిమా మాత స్వరూపం వద్ద బిషప్ బెరెట్టా ప్రార్థనలు చేయగా ఆటంకాలు తొలగిపోయాయి. 1961 జనవరి 14న ఓరుగల్లు పీఠాధిపతుల నిలయానికి శంకుస్థాపన చేశారు. బిషప్ బెరెట్టా అనుమతితో ఈ ప్రాంతానికి బ్రదర్ సాలా ఫాతిమానగర్ అని నామకరణం చేసి ఈ మేత్రాసనాన్ని ఫాతిమా తల్లికి అంకితమిచ్చారు. అప్పటి నుంచి ఈ ప్రాంతం ఫాతిమానగర్‌గా ఫాతిమామాత దేవాయలంగా ప్రాచుర్యంలోకి వచ్చింది.

అద్భుత రాతి కట్టడం

1956లో బిషప్ బెరెట్టా ఫాతిమామాత పేరుమీద కేథడ్రల్ చర్చి నిర్మాణానికి శంకుస్థాపన చేసి బ్రదర్ సాలాకు నిర్మాణ పనులు అప్పగించారు. ములుగు ప్రాంతం నుంచి ప్రత్యేక రాతిని తెప్పించి సుమారు 6సంవత్సరాలపాటు శ్రమించి కట్టడాన్ని నిర్మించారు. 1962 మార్చి 13న బిషప్ బెరెట్టా ఫాతిమా మాత దేవాలయాన్ని ప్రతిష్ఠించారు. అప్పటి నుంచి ఇక్కడ ప్రార్థనలు, పండుగలకు నిలయం. క్రీస్తు తల్లి ఫాతిమామాత విన్నప ప్రార్థనల ద్వారా దేవుడు ఈ మేత్రాసనంపై ఎంతో మేళ్లను, అనుగ్రహాలను కురిపిస్తున్నారని భక్తుల విశ్వాసం. ఫాతిమామాత గౌరవార్థం మేత్రాసన స్థాయిలో ప్రతి ఏటా మతాలకు అతీతంగా పండుగాలు జరుగుతున్నాయి.



విద్యుత్ కాంతులతో అలంకరించిన ఫాతిమామాత గుహ

గుహ ప్రత్యేక ముస్తాబు

ఫాతిమా ఉత్సవాలకు ఫాతిమామాత గుహను విద్యుత్ కాంతులతో సుందరంగా అలంకరించారు. ఉత్సవాల ముగింపు వరకు భక్తులు గుహ వద్ద కొబ్బరి కాయలు, క్యాండిల్స్ వెలిగించి ప్రార్థనలు చేసి తమ కోర్కెలు తీర్చమని వేడుకుంటారు.

టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేశాం



కేయూలో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మంత్రులు పొంగులేటి శ్రీనివాస్, సురేఖ, సీతక్క తదితరులు

నిరుద్యోగులను విస్మరించిన బీఆర్ఎస్
- కాంట్రాక్టు లెక్చరర్ల రెగ్యులరైజేషన్‌పై సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి..
- కేయూలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన
- పాల్గొన్న మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖ, సీతక్క

కేయూ క్యాంపస్: ప్రత్యేక రాష్ట్ర సాధనలో యూనివర్సిటీల్లోని యువత కీలకపాత్ర పోషించారని, పదేళ్లలో గత ప్రభుత్వం నిరుద్యోగ యువతను విస్మరించిందని.. కాంగ్రెస్ ప్రభుత్వం టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేసి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తుందని రాష్ట్ర మంత్రి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కాకతీయ యూనివర్సిటీలో వీసీ ఆచార్య తాటికొండ రమేష్ అధ్యక్షతన మంత్రులు దనసరి అనసూయ(సీతక్క), కొండా సురేఖ, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్ నాగరాజులతో మంత్రి పొంగులేటి కలిసి కే హబ్‌తోపాటు పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. కే హబ్‌ను ప్రారంభించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. మార్పురావాలి ప్రజాపాలన రావాలని ప్రజలు కోరుకున్నారని అన్నారు. వారు కోరుకున్నట్లుగానే ఎన్నికల హామీలను నెరవేరుస్తున్నామని తెలిపారు. ఈనెల 11న భద్రాచలం రాముడి పాదాల వద్దనుంచే అర్హులైన లబ్ధిదారుల కోసం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నట్లు పొంగులేటి వెల్లడించారు. గత ప్రభుత్వ హయాంలో టీఎస్‌పీఎస్సీ ఉద్యోగాల భర్తీలో నిర్లక్ష్యం వహించిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోనికి రాగానే అప్పటి టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేసి అర్హులైనవారిని టీఎస్‌పీఎస్సీలో నియమించిందన్నారు. రాష్ట్రంలో 2లక్షలు ఉద్యోగాల ఖాళీ ఉన్నట్లు గుర్తించామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో 70రోజుల్లోనే 31వేల ఉద్యోగాలు భర్తీచేశారన్నారు. అలాగే టీఎస్‌పీఎస్సీ ద్వారా పలు నోటిఫికేషన్లు ఇచ్చినట్లు పేర్కొన్నారు. మెగా డీఎస్సీ ద్వారా 11,062వేల ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి కూడా ప్రభుత్వం ముందుకొచ్చిందన్నారు. కేయూలో పలువురు కాంట్రాక్టు అధ్యాపకులు రెగ్యులరైజ్ కావాలని, ఉద్యోగ భద్రత కావాలని తమకు విన్నవించారని.. ఈ అంశాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. పదేళ్లలో గత ప్రభుత్వంలోని మంత్రులెవరు కేయూలోకి రాలేదని తెలిపారు. యూనివర్సిటీలో రూ.14 కోట్ల విలువచేసే అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేసినట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. ఆయా కార్యక్రమాల్లో కేయూ వీసీ ఆచార్య తాటికొండ రమేష్, రిజిస్ట్రార్ ఆచార్య మల్లారెడ్డి, బిల్డింగ్ డివిజన్ అధికారి ఆచార్య వాసుదేవరెడ్డి, కలెక్టర్ సిక్తాపట్నాయక్, ఐటీడీఏ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ హేమలత, టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కోఆర్డినేటర్ గాదె దయాకర్ పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై టాస్క్‌ఫోర్స్ దాడి

- 13 మంది అరెస్ట్, నాలుగు కార్లు స్వాధీనం
- రూ.1.26 లక్షల నగదు పట్టివేత

బచ్చన్నపేట : జనగామ జిల్లా బచ్చన్నపేట మండలంలోని పోచన్నపేటకు చెందిన వెంకట్‌రెడ్డి వ్యవసాయ క్షేత్రం వద్ద శనివారం రాత్రి పేకాట శిబిరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేశారు. అక్కడ పేకాట ఆడుతున్నట్లు పక్కా సమాచారంతో.. ఏసీపీ మధుసూదన్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కర్ణాకర్, ఎస్సై శరత్‌తోపాటు బృందం రాత్రి దాడి చేశారు. పేకాట ఆడుతున్న ఆలేరు, భువనగిరి, పెంబర్తి, జనగామ, సిరిపురం గ్రామాలకు చెందిన 13 మందిని పట్టుకున్నారు. వారి నుంచి 12 సెల్‌ఫోన్‌లు రూ.1.26 లక్షల నగదు, నాలుగు కార్లు, ఒక బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. అరెస్ట్ చేసిన వారిని బచ్చన్నపేట పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు.

పెరిగిన విద్యుత్ వినియోగం

- టీఎస్ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి

హన్మకొండ: వినియోగదారులకు అంతరాయాలు లేకుండా మెరుగైన, సరఫరాతో రాష్ట్రంలో విద్యుత్ వినియోగం పెరిగిందని టీఎస్ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్‌రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో 15,623 మెగావాట్ల విద్యుత్ వినియోగం జరిగినట్లు రికార్డు నమోదైందని, 303.6 మిలియన్ యూనిట్ల మైలురాయిని చేరుకున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులకు మెరుగైన, నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడానికి విద్యుత్ అధికారులు, ఉద్యోగులు అహర్నిశలు శ్రమిస్తున్నారని పేర్కొన్నారు. టీఎస్ ఎన్పీడీసీఎల్‌లో 2022-23 ఆర్థిక సంవత్సరం డిసెంబర్, జనవరి, ఫిబ్రవరితో పోల్చుకుంటే 33 కేవీ బ్రేక్‌డౌన్స్ 506 ఉండగా.. 2023-24 ఆర్థిక సంవత్సరం డిసెంబర్, జనవరి, ఫిబ్రవరిలో కేవలం 313 మాత్రమే అయ్యాయని, 38 శాతం బ్రేక్ డౌన్స్ తగ్గాయని వివరించారు. అలాగే 33 కేవీ ట్రిప్పింగ్స్ 14 శాతం, ట్రాన్స్‌ఫార్మర్‌ల వైఫల్యాలు 25 శాతం, పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల వైఫల్యాలు 23 శాతం తగ్గాయన్నారు. జంపర్లను సరిచేస్తూ.. ఒరిగిన స్తంభాలను సరిచేస్తూ.. 200 ఫీడర్లపై కెపాసిటర్ బ్యాంకులను అమర్చి 530 ఫీడర్లలో పవర్ ఫాక్టర్‌ను నిర్వహించడం ద్వారా లోవోల్టేజీ సమస్యను నివారించినట్లు పేర్కొన్నారు. వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ అందిస్తున్నామని, వేసవిలోనూ దీనిని కొనసాగించేందుకు సిద్ధంగా ఉన్నట్లు వివరించారు.

అనుమతి లేనిదే లోనికి రావొద్దు

- కానిస్టేబుల్, విద్యార్థి తండ్రి మధ్య వాగ్వాదం
- ధర్నా చేసిన విద్యార్థుల తల్లిదండ్రులు

మహబూబాబాద్ అర్బన్: ఓ విద్యార్థి పెన్నులు మర్చిపోయి పరీక్షహాల్‌లోకి వెళ్లడంతో విద్యార్థి తండ్రి కృష్ణ పరీక్ష కేంద్రంలోకి వెళ్లి పెన్నులు ఇచ్చే క్రమంలో అనుమతి లేనిది లోపలికి రావొద్దని, విద్యార్థి తండ్రిని పోలీసు కానిస్టేబుల్ ఆపాడు. దీంతో కానిస్టేబుల్, కృష్ణకు మధ్య తీవ్ర వాగ్వాదం జరిగిన ఘటన మానుకోట జిల్లా కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ఎదుట జరిగింది. వివరాలిలా ఉన్నాయి. జిల్లా కేంద్రంలోని గురుకుల పాఠశాలలో సైనిక్ స్కూల్ ఆరో తరగతి ప్రవేశపరీక్ష నిర్వహిస్తున్న క్రమంలో ఓ విద్యార్థి పెన్నులు మరిచిపోయి పరీక్ష కేంద్రంలోకి వెళ్లాడు. దీంతో విద్యార్థి తండ్రి కేంద్రంలోకి వెళ్లి పెన్నులు ఇచ్చే క్రమంలో కానిస్టేబుల్ విద్యార్థి తండ్రి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈక్రమంలో కానిస్టేబుల్.. కృష్ణపై చేయి చేసుకున్నాడని తెలిసి.. తల్లిదండ్రులు ఒక్కసారిగా కానిస్టేబుల్ దేవేందర్‌పై దాడి చేశారు. అనంతరం పాఠశాల సిబ్బంది తల్లిదండ్రులను బయటకు పంపించారు. ఈ సందర్భంగా పలువురు తల్లిదండ్రులు మాట్లాడుతూ.. పరీక్ష కేంద్రం లోపలికి వెళ్లే తమ కుమారుడు పెన్నులు మర్చిపోవడంతో ఇచ్చే క్రమంలో కృష్ణపై కానిస్టేబుల్ చేయి చేసుకున్నాడన్నారు. దీంతో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ సమయంలో కృష్ణ డబ్బులు, సెల్‌ఫోన్ పోయినట్లు తెలిపారు. అకారణంగా చేయి చేసుకోవడంతో.. చేయి చేసుకున్నామే తప్ప ఉద్దేశపూర్వకంగా కాదన్నారు. కానిస్టేబుల్ దురుసుప్రవర్తనపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరారు. కాగా, ఈఘటనలో కృష్ణ, మోహన్, వెంకన్నపై కేసు నమోదు చేసినట్లు సీఐ దేవేందర్ వెల్లడించారు.

క్రీడలతోనే స్నేహభావం పెంపొందుతుంది



విజేతగా నిలిచిన క్రీడాకారులతో నవోదయ ప్రిన్సిపాల్ పూర్ణిమ, ఏకశిలా యూత్ బాధ్యులు

- జవహర్ నవోదయ ప్రిన్సిపాల్ పూర్ణిమ
- ముగిసిన రాష్ట్రస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ టోర్నమెంట్

మామునూరు : క్రీడలతో విద్యార్థుల మధ్య స్నేహభావం, పోటీతత్వం, క్రమశిక్షణే పెంపొందుతాయని జవహర్ నవోదయ ప్రిన్సిపాల్ పూర్ణిమ అన్నారు. ఖిలావరంగల్ మండలం తిమ్మాపురంలోని క్రీడామైదానంలో ఏకశిలా యూత్ అసోసియేషన్, లైబ్రరీ ఆధ్వర్యంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. బ్యాడ్మింటన్ నేషనల్ క్రీడాకారుడు కల్లెపు సురేందర్ ఆధ్యక్షతన జరిగిన ముగింపు సమావేశంలో ఆమె ముఖ్యఅతిథిగా మాట్లాడారు. యువత అంతర్జాతీయ క్రీడాకారులను ఆదర్శంగా తీసుకుని పాఠశాల స్థాయి నుంచే క్రీడలపై మక్కువ పెంచుకుని అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని సూచించారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. క్రీడల్లో రాణించిన విద్యార్థులను ప్రభుత్వ గుర్తించి స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగం సాధించిన క్రీడాకారులు కోకొల్లలుగా ఉన్నారని గుర్తుచేశారు. అనంతరం వరంగల్ ఎంగ్‌స్టార్స్ ప్రథమ, తిమ్మాపురం ద్వితీయ, షాద్‌నగర్ మహబూబ్‌నగర్ తృతీయ, బీహెచ్‌ఎల్ మెదక్ నాలుగో స్థానంలో నిలిచింది. ఈ జట్లకు నవోదయ ప్రిన్సిపాల్ పూర్ణిమ చేతులమీదుగా విజేతలకు మెమొంటోలు, నగదు బహుమతులు, ప్రశంసపత్రాలు అందజేశారు. నేషనల్ ప్లేయర్ బొల్లు యాకయ్య, మేకల సూరయ్య, బీరం రాంరెడ్డి, దశరథం, మాచర్ల రమేష్, బిక్షపతి పాల్గొన్నారు.

అప్పు తెచ్చిన డబ్బు అగ్గిపాలు

- విద్యుత్ షాట్ సర్క్యూట్‌తో పూరిగుడిసె దగ్ధం
- కాలిపోయిన బంగారం, వెండి, నగదు



కాలిబూడిదైన పూరి గుడిసె



మంటల్లో కాలిపోయిన నగదు

దుగ్గొండి: ఇల్లు నిర్మాణంతోపాటు, వరకట్నంగా ఇచ్చేందుకు అప్పుగా తీసుకున్న డబ్బులు అగ్ని ప్రమాదంలో కాలిబూడిదైన ఘటన వరంగల్ జిల్లా దుగ్గొండి మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. ఈప్రమాదంతో రూ.10లక్షల వరకు ఆస్తినష్టం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గిర్నిబావి గ్రామానికి చెందిన రాయపురి నర్సయ్య ఇంటి నిర్మాణం చేసుకుంటున్న క్రమంలో పక్కనే పూరిగుడిసె వేసుకుని అందులో నివాసం ఉంటున్నాడు. వేసవి కాలం కావడంతో గుడిసె ముందర ఖాళీ స్థలంలో శనివారం రాత్రి నిద్రకు ఉపక్రమించారు. ఆదివారం తెల్లవారుజామున విద్యుత్ షాట్ సర్క్యూట్ జరిగి మంటలు లేచి గుడిసె అంటుకుంది. మంటలు ఎక్కువ కావడం, గుడిసెలోని ఫ్రిడ్జిలోని గ్యాస్ పేలిపోయి భారీ శబ్దం రావడంతో మేల్కొన్న నర్సయ్య కుటుంబ సభ్యులు మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. అయితే అప్పటికే ఇల్లు పూర్తిగా కాలి పోయింది. ఇంటి నిర్మాణం కోసం అప్పు తెచ్చుకున్న డబ్బులతోపాటు, బిడ్డ పెళ్లి సందర్భంగా అల్లుడికి ఇవ్వాల్సిన డబ్బుల కోసం అప్పు తెచ్చి రూ.4లక్షలు కాలిపోయాయి. నోట్ల కట్టలు సగం కాలిపోగా 4తులాల బంగారు, 100తులాల వెండి కాలిపోయింది. ఇంట్లోని ఫ్రిడ్జి, టీవీ, ఫ్యాన్, బీరువాలు, వాటిలోని దుస్తులు, వస్తువులన్నీ బూడిదయ్యాయి. కట్టుబట్టలు తప్ప ఏమీలేకుండా కాలిపోయాయి. సమాచారం అందుకున్న ఎస్సై జక్కుల పరమేష్ ఘటన స్థలాన్ని పరిశీలించారు. కాగా, బాధితుడిని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఓదార్చారు. వివరాలు అడిగి తెలుసుకున్నాడు. అండగా ఉంటానని హామీ ఇచ్చారు.

ఉరివేసుకొని వ్యక్తి ఆత్మహత్య

ఎల్కతుర్తి: ఓ హోటల్లో పనిచేస్తున్న వర్కర్ ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఆదివారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ధర్మసాగర్ మండలం దేవునూర్‌కు చెందిన గాజుల కోటి(50) తన ఫ్యామిలీకి దూరంగా ఉంటున్నాడు. 40 రోజుల క్రితం ఎల్కతుర్తికి వచ్చి హోటల్‌లో పనిచేస్తానని హోటల్ యజమాని శ్రీధర్‌ను అడుగగా పనిలో పెట్టుకున్నాడు. హోటల్ నడవకపోవడంతో గత పది రోజులుగా హోటల్ బంద్ పెట్టాడు. ఇంటికి వెళ్లమని యజమాని కోటికి చెప్పగా ఇక్కడే ఉంటానని చెప్పడంతో సరే ఉండమని చెప్పాడు. దీంతో హోటల్‌లోనే తిని పడుకుంటున్నాడు. ఆదివారం యజమాని కుమారుడు గ్యాస్ కోసం హోటల్‌కు వచ్చి వెతుకుతుండగా చీకటిగదిలో ఉరేసుకొని వేలాడుతూ కనిపించాడు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని మార్చురీకి తరలించినట్లు ఎస్సై గోదారి రాజ్‌కుమార్ తెలిపారు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

అనారోగ్యంతో మహిళ..

పలిమెల: అనారోగ్యంతో బాధపడుతున్న మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రంలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్సై తమాషారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం పలిమెలకు చెందిన జనగామ లక్ష్మి (55) నాలుగేళ్లుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతూ అనారోగ్య తీవ్రతను తట్టుకోలేక ఆదివారం క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి కుమారుడు జనగామ శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రైలుకింద పడి గుర్తుతెలియని వృద్ధుడి..

కాశిబుగ్గ : రైలుకింద పడి గుర్తుతెలియని వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన వరంగల్-కాజీపేట రైల్వేస్టేషన్ల మధ్య మేఘన బార్ అండ్ రెస్టారెంట్ ఎదురుగా ఉన్న రైల్వేట్రాక్‌పై ఆదివారం జరిగింది. జీఆర్పీ సీఐ నరేష్ కథనం ప్రకారం.. మృతుడు 55 నుంచి 60 సంవత్సరాల మధ్య వయస్సు, 5.3 ఎత్తు చామనఛాయ గుండ్రని ముఖం కలిగి ఛాతిపై కుడి పక్క పుట్టు మచ్చ ఉందన్నారు. ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో మృతదేహన్ని ఎంజీఎం మార్చురీలో భద్రపరచామని సీఐ తెలిపారు. ఎవరికైనా వివరాలు తెలిస్తే హెడ్‌కానిస్టేబుల్ కె.భాస్కర్‌ను లేదా 9440361941, 8712658585 నంబర్లలో సంప్రదించాలని సీఐ సూచించారు.

బాలుడి కిడ్నాప్ కలకలం!

- రెండు గంటల తర్వాత ప్రత్యక్షం
- ఊపిరి పీల్చుకున్న పోలీసులు, కుటుంబ సభ్యులు



సీసీ పుటేజీలను పరిశీలిస్తున్న ఎస్సై సృజన్

జనగామ: జనగామ పట్టణం ప్రిస్టన్ మైదానంలో పతంగి ఎగుర వేస్తున్న ఓ బాలుడి కిడ్నాప్ కలకలం టెన్షన్ పెట్టించింది. పల్సర్ బైక్‌పై గుర్తు తెలియని వ్యక్తులు తీసుకెళ్లారని ప్రత్యక్ష సాక్షులు తెలుపడంతో పోలీసులు అలర్టయ్యారు. కొడుకు ఇంటికి రాలేదని తల్లిదండ్రులు.. కాలనీ వాసులు పోలీస్‌స్టేషన్‌కు రాగా... ఎస్సై సృజన్ ఆధ్వర్యంలో గాలింపు చర్యలు మొదలు పెట్టారు. మధ్యాహ్నం 1.48 నిమిషాలకు బాలుడు మాయమైనట్లు ప్రచారం జరగ్గా.. పోలీసులు ప్రిస్టెన్, సూర్యాపేట రోడ్డు, ఆర్టీసీ చౌరస్తా తదితర ఏరియాల్లోని సీసీ పుటేజీలను పరిశీలించారు. సీసీ పుటేజీలను పరిశీలిస్తున్న క్రమంలో మధ్యాహ్నం 3.40 నిమిషాలకు బాలుడు ఇంటికి చేరుకున్నట్లు పోలీసులు సమాచారం అందుకున్నారు. బాలుడిని కంట్రోల్ రూంకు తీసుకొచ్చి, కిడ్నాప్‌కు సంబంధించి ఎస్సై సృజన్ బాలుడితో మాట్లాడారు. ప్రిస్టన్ మైదానంలో ఆడుకుంటున్న సమయంలో తెలిసిన వారితో బైక్‌పై ఇంటికి వెళ్లి, అక్కడ నుంచి దుకాణం వెళ్లి రావడంతో ఆలస్యమైనట్లు చెప్పాడు. దీంతో అప్పటి వరకు టెన్షన్‌గా ఉన్న పోలీసులు.. కన్నీరు మున్నీరుగా విలపిస్తున్న తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు.

వ్యవసాయబావిలో పడి రైతు మృతి



వెంకన్న మృతదేహం

కేసముద్రం: ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో జారిపడి ఓ రైతు మృతి చెందిన సంఘటన మండలంలోని ధన్నసరి గ్రామశివారు రేకులతండాలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్సై వంశీధర్ కథనం ప్రకారం..తండాకు చెందిన కేలోత్ వెంకన్న (40) తన భార్య, ఇద్దరు కుమారులను ఇదే గ్రామంలోని శ్రీమల్లికార్జున స్వామి ఆలయానికి వెళ్లిరండని చెప్పాడు. పంటపొలానికి మందు కొట్టి వస్తానని చెప్పి పంటచేను వద్దకు వెళ్లాడు. ఇంతలో గుడికి వెళ్లి భార్య, కుమారులు తిరిగి ఇంటికి వచ్చారు. అప్పటి వరకు వెంకన్న ఇంటికి రాకపోవడంతో చిన్నకుమారుడు వ్యవసాయబావి వద్దకు వెళ్లి చూడగా బావిలో తండ్రి పడి ఉండటాన్ని గమనించి కుటుంబ సభ్యులకు తెలిపాడు. దీంతో కుటుంబ సభ్యులు, తండావాసులు వెళ్లి చూడగా అప్పటికే అతడు మృతి చెందినట్లు గుర్తించారు. అనంతరం మృతదేహాన్ని బయటకు తీశారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. బావి వద్దకు వెళ్లిన వెంకన్న ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో జారిపడగా బావిలో నీళ్ల తక్కువగా ఉండటంతో అతడు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఛత్తీస్‌గఢ్‌లో రోడ్డు ప్రమాదం

- ఖమ్మం, మహబూబాబాద్ జిల్లా వాసుల మృతి



రాజిరెడ్డి (ఫైల్)



ఎస్‌కే షబ్బీర్ (ఫైల్)

ఖమ్మంరూరల్: ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాలకు చెందిన ఇద్దరు మృతి చెందిన ఘటన శనివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. ఖమ్మంరూరల్ మండలానికి చెందిన ఈగ రాజిరెడ్డి (37), మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తికి చెందిన షేక్ షబ్బీర్ (35) కలిసి గ్రానైట్ వ్యాపారం చేస్తున్నారు. వారం రోజుల క్రితం వీరు ఛత్తీస్‌గఢ్‌లోని జగదల్‌పూర్‌లో ఓ గ్రానైట్ క్వారీ నుంచి రాయిని తీసుకుని ఖమ్మం వస్తుండగా మార్గమధ్యలో మూలమలుపు వద్ద లారీ అదుపుతప్పింది. ఈ క్రమంలో గ్రానైట్ రాళ్లు క్యాబిన్‌పై పడటంతో వారిద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. కాగా షబ్బీర్ ఐదేళ్లుగా వరంగల్‌క్రాస్‌రోడ్డులో కుటుంబంతో నివాసముంటున్నాడు. రాజిరెడ్డి ఖమ్మం నగరంలోని సారథినగర్‌వాసి.